క్లుప్తంగా

శివాలయాల్లో భక్తుల సందడి



ఆకాశ దీపాన్ని సిద్ధం చేస్తున్న పూజారీ

జమ్మలమడుగు : కార్తీక మాసం ప్రారంభం కావడంతో శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని శైవక్షేత్రాలైన కన్యతీర్థం, గురప్ప కోన, ఆగస్తీశ్వర కోనలతో పాటు, పట్టణంలోని గ్రంథేసోమేశ్వర, జంబులింగేశ్వర ఆలయాలలో ప్రత్యేకం పూజలతో పాటు వచ్చె భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామంలోని బసవేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆకాశదీపం వెలిగించి ధ్వజ స్తంభానికి నిలబెట్టారు.

భవన నిర్మాణం కోసం చేయూత



సేవా సమితి అధ్యక్షుడు రాజుకు నగదును అందిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని నూతన బస్టాండ్ ప్రాంతంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మించనున్న భవన నిర్మాణం కోసం పులివెందుల స్టేట్ బ్యాంక్ (మెయిన్) ఉద్యోగులు శనివారం 10,016 రూపాయల నగదును అందించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్యామలరావు, డిప్యూటీ మేనేజర్ కార్తీక్, లోకల్ సెక్రటరీ ఓబులేసుల చేతులమీదుగా సేవా సమితి అధ్యక్షుడు రాజుకు నగదును అందించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పాఠశాల విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఏపీజీబీ మేనేజర్ సుధాకర్

తొండూరు : మండలంలోని మల్లేల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏపీజీబీ మేనేజర్ కోనేటి సుధాకర్ బహుమతులను అందజేశారు. శనివారం మల్లేల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులు ఎం.ప్రహర్షిని, రామచంద్ర, ఆయేషాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ అనిల్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కమలాపురం : వీఏఏలందరూ రైతులకు అందుబాటులో ఉండాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి రబీ సీజన్ పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీఏఏ తమ రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారికి పంటల సాగులో కావాల్సిన తోడ్పాటు అందించాలన్నారు. పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల వాడకం, సేంద్రీయ ఎరువుల వినియోగం పై రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు ఏఈఓ, వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా సమస్త ఆత్మల దినం



వైఎస్సార్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాస్టర్లు

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ గ్రామంలోని వైఎస్సార్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద శనివారం సమస్త ఆత్మల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధి వద్ద పాస్టర్లు రెవరెండ్ సుధాకర్‌బాబు, నరేష్, మృత్యుంజయుడులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడే ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద పుష్పగుంచాల ఉంచి నమస్కరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పెద్దల ఆత్మలు సంతోషంగా ఉండాలని కోరుకున్నామని తెలిపారు. నేటి నిజ జీవితంలో పుట్టుకలు, మరణాలు సర్వ సాధారణమన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

శివునికి ప్రీతికరమైనది కార్తీక మాసం. శుభకరమైన కార్తీక మాసం ప్రతి ఏటా దీపావళి మరుసటి రోజు నుంచి ప్రారంభమవుతుంది. హరిహరాదులకు ప్రీతిపాత్రమైన ఈ మాసంలో భక్తులు నియమ నిష్టలతో చేసే నోములకు ఎంతో ప్రాధాన్యత ఉంది. శివపార్వతుల అనుగ్రహం కోసం మహిళలు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిలో కార్తీక మాసం అంటే నెల రోజులపాటు పండుగ దినాలే. ఈ మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీపారాధనతో శుభ ఫలితాలతోపాటు ఆరోగ్య భాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం (రావులకొలను) గ్రామ సమీపాన కొండల నడుమ పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన స్వయంభు భానుకోట శ్రీసోమేశ్వరస్వామి ఆలయ (భానుకోట) అందాలు ఊటీని తలపిస్తున్నాయి. జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలలోకెల్లా మహాశక్తివంతమైన శివ పీఠం. ప్రాచీన ఆలయంలో పూర్వంబోనాసురుడు అనే రాక్షసుడు శివభక్తులను, రుషులను, దేవతామూర్తులను వెంటాడి మరి చిత్ర హింసలకు గురి చేస్తుండేవాడు. ఈ క్షేత్రంలోని బోనాసురుడు క్షేత్రానికి, అతని సామ్రాజ్యాన్ని బోనాసుర గద్దె అని.. దాన్ని స్థిర స్థానంగా ఏర్పరుచుకుని అతను తపస్సులో నిమగ్నమై ఉండగా.. తన స్థావరాలవైపు ఎవరూ రాకుండా శివుడే ద్వార పాలకునిగా(కాపాలాదారునిగా ద్వారం వద్ద) నియమించుకుని నేటికి బోనాసుర గద్దె దారి వద్ద శిలా విగ్రహమై(శివలింగంపై) భక్తులను దర్శనమిస్తుండేవాడు. అయితే ఈ రాక్షసుడి బారి నుంచి భక్తలను, రుషులను కాపాడటానికి పరమశివుడుగా ఉద్భవించాడు. అలాగే నిత్యం మునీశ్వరుడు జనమే జయ



సింహాద్రిపురం : ఊటీని తలపిస్తున్న భానుకోట ఆలయానికి వెళ్లే రహదారి

మహారాజు స్వామివారిని దర్శించుకున్నట్లు పురాణ ఇతిహాసాలలో చెప్పుకోవచ్చు. అలాగే శివకేశవుల సంగ్రామం ఇక్కడే జరిగిందని పురాణాల ఆధారంగా తెలుస్తోంది. ఆలయంలో 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు బద్రి శర్మ, సురేష్ శర్మలు తెలిపారు. తొలి సోమవారం అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే కార్తీక పౌర్ణమి రోజు లక్ష దీపారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్తీక మాసం మొత్తం నెలరోజు అభిషేకాలు చేయించుకోవాల్సిన వారు 900 0710411 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.



సింహాద్రిపురం : అందంగా రూపుదిద్దుకున్న భానుకోట శ్రీసోమేశ్వరస్వామి ఆలయం



భానుకోట శ్రీసోమేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం



భానుకోట శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలోని కోనేరు

• భక్తుల కొంగు బంగారం భైరవేశ్వరుడు



వేముల : శ్రీభైరవేశ్వరుని మూలవిరాట్



వేముల : భైరవేశ్వరస్వామి ఆలయం

వేముల : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రాలలో భైరవేశ్వరాలయం ఒకటి. ఈ ఆలయాన్ని రెండు అంతస్తులుగా నిర్మించారు. వేముల మండలం నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలోని మోపూరి కొండపై వెలసిన శ్రీభైరవేశ్వస్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడి ఆలయంలో 20 అడుగుల భైరవేశ్వరస్వామి విగ్రహం ఉంది. కార్తీక మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లా నుంచేకాక కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయానికి అన్ని వైపుల నుంచి వెళ్లేందుకు రహదారులు ఉన్నాయి. పులివెందుల నుంచి వెళ్లేవారు వీరపునాయునిపల్లె రహదారిలో నల్లచెరువుపల్లె గ్రామం నుంచి వెళ్లవచ్చు. ప్రొద్దుటూరు నుంచి వచ్చే భక్తులు వీరపునాయునిపల్లె-పులివెందుల రహదారిలో వెళితే భైరవేశ్వరాలయాన్ని చేరుకోవచ్చు. కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని చాగలేరు క్రాస్ వద్ద నుంచి పెర్నపాడు, పెండ్లూరు, కొండ్రెడ్డిపల్లె గ్రామాల మీదుగా భైరవేశ్వరాలయానికి వెళ్లవచ్చు. భక్తులకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

• శైవక్షేత్రాలు అందంగా ముస్తాబవుతున్నాయి

పులివెందుల టౌన్ : కార్తీక మాసోత్సవం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. శైవక్షేత్రాలు అందంగా ముస్తాబవుతున్నాయి. భక్తులు శివాలయాలకు చేరుకుని కార్తీక పూజలు చేస్తారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి తమ ఇష్టదైవమైన పరమ శివుడిని ఆరాధిస్తారు. మహిళలు తెల్లవారుజామున లేచి తలంటు స్నానం ఆచరించి ఇంటి ముంగిట రంగవల్లులను అందంగా అలంకరించి అందులో కార్తీక దీపాలు వెలిగిస్తారు. పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి, ఉమామహేశ్వరస్వామి ఆలయం, మండల పరిధిలోని నామాలగుండు సిద్ధలింగేశ్వరస్వామి ఆలయం, పంచలింగాల, గుండాలకోన ఆలయాలు.



పులివెందుల : నామాలగుండు సిద్ధలింగేశ్వర స్వామి ఆలయం

సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలెందుకు?

రెవెన్యూ అధికారులను ప్రశ్నించిన రైతులు

కమలాపురం : సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలని రైతులు మునీంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు ప్రశ్నించారు. శనివారం పెద్దచెప్పలిలో భూ రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. పెద్ద చెప్పలి సచివాలయ పరిధిలోని రైతులందరూ తమ సమస్యలు పరిష్కరించుకుందామని కోటి ఆశలతో గ్రామసభకు వచ్చారు. అయితే మండల తహసీల్దార్ రాక కోసం మధ్యాహ్నం 1 గంట వరకు వేచి చూశారు. ఆయన ఇక రాడని తెలుసుకున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. కాగా సమావేశానికి వచ్చిన భూ రీ సర్వే డీటీ శ్రీకాంత్‌తో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలి అని గట్టిగా ప్రశ్నించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు సంబంధించిన అడంగల్, 1బీ రావడం లేదన్నారు. తమకు ఇప్పుడు అడంగల్, 1బీ అవసరం అని, అవి రావడం లేదన్నారు. రెవెన్యూ కార్యాలయంలో వైట్



భూ రీసర్వే డీటీని ప్రశ్నిస్తున్న రైతు మునీంద్రారెడ్డి

పేపర్‌పై తీస్తున్నారని, వాటిపై సంతకం చేసి ఇవ్వమంటే ఆర్ఎస్ఆర్, ఆర్ ఇవ్వమంటున్నారని, అవి మా దగ్గర ఎలా వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రాప్ లోన్ రెన్యువల్‌కు ఇవ్వాలని చెప్పినా ఆర్ఐ, డీటీలు వాటి పై సంతకాలు చేయడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనంలేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి క్రాప్ లోన్ రెన్యువల్ కోసం వెళ్లే రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ మద్యపాన నిరోధానికి చర్యలు

కమలాపురం : మండలంలో బహిరంగ మద్యపానం సేవించే పలు ప్రదేశాలను గుర్తించి వాటిని పోలీసులు శుభ్రం చేశారు. శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిల పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పట్టణ పరిధిలోని షాదీఖాన, గఫార్ పెట్రోల్ బంక్, కోగటం రోడ్డు, క్రాస్ రోడ్డు తదితర చోట్ల బహిరంగ మద్యపానం చేస్తున్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేశారు. అలాగే పోలీస్‌స్టేషన్ సమీపంలో సైతం పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేసి యువతకు క్రీడా ప్రాంగణాలుగా తీర్చి దిద్దారు. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో బహిరంగ మద్యపానం చేసే ప్రాంతాలను గుర్తించామని, వాటిని జేసీబీ,



పోలీసులు శుభ్రం చేసిన స్థలంలో యువకులు

డోజర్ ద్వారా శుభ్రం చేశామన్నారు. ఇకపై ఆ ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ ప్రాంతాలను యువకులు షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడుకునే విధంగా సిద్ధం చేస్తామన్నారు. శుభ్రం చేసిన అనంతరం యువతతో కలసి సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది వాలీబాల్ ఆడారు.

నీటి సమస్య లేకుండా చూస్తాం

పులివెందుల టౌన్ : పట్టణంలోని క్రిష్టియన్‌లైన్ కాలనీలో నీటి సమస్య లేకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కాలనీ వాసులకు సూచించారు. శనివారం స్థానిక క్రిష్టియన్‌లైన్ కాలనీలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వాహకంవల్లనే మున్సిపాలిటీ ప్రజలకు కష్టాలు, నీటి సమస్య, వీధిలైట్ల నిర్వహణ, డ్రైనేజీ నిర్వహణ, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చలేని దుస్థితి నెలకొందన్నారు. కనీసం బిల్లులు కూడా సీఎఫ్ఎంఎస్‌లో ముందుకు కదలకుండా కక్ష కట్టారన్నారు. దీనిపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో త్వరలో ప్రజా ఉద్యమం చేయడానికి కూడా



కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

సన్నాహాలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఏ రోజు కూడా నీటి కష్టాలు ఎదరైనా సంఘటనలు లేవని.. ప్రజలందరూ అన్ని విషయాలను గమనించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పోలీసుల పాత్ర చాలా విలువైనది

పులివెందుల రూరల్ : సమాజంలో పోలీసుల పాత్ర చాలా విలువైనదని పులివెందుల డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ప్రజలకు అమరవీరుల గురించి అవగాహన కల్పించారు. గ్రామాలలో, పట్టణాలలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా పోలీసులు చాలా ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా 24 గంటలు పనిచేయగల ఒకే ఒక వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. కార్యక్రమంలో సీఐలు జీవన్‌గంగానాథ్‌బాబు, వెంకటరమణ, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐలు

ఓం శాంతి భవన్‌లో దీపావళి వేడుకలు

వేంపల్లె : వేంపల్లెలోని ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం శాంతి నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్యలు అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. అలాగే శనివారం బలి పాడ్యమి సందర్భంగా భగనీ హస్త భోజనం, దీపావళి విశిష్టత శివపరమాత్ముని యొక్క వాక్యాల్లో వివరించారు.

రేషన్‌పై అదనపు డబ్బులు వసూళ్లు చేస్తే చర్యలు

ఎర్రగుంట్ల : ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎండీయూ ఆపరేటర్లు కానీ, డీలర్లు కానీ కార్డుదారుల నుంచి ఒక్కపైసా అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శోభన్ బాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కొందరు అదనపు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాగే అక్రమంగా రేషన్ పక్కదారి తరలించిన వారిపై కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. కొందరు ఎండియూ ఆపరేటర్లు రేషన్‌ను అక్రమంగా రతరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వారిపై నిఘా పెట్టామన్నారు.

అక్రమ ఇసుక తరలిస్తే చర్యలు

ఎర్రగుంట్ల : మండలంలోని పెన్నానది నుంచి ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని తాహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. శనివారం బీస్మిల్లాబాదు గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఉచిత ఇసుక కావాలంటే సంబంధిత సచివాలయాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్వారీ ఉన్న చోట మాత్రమే ఉచితంగా ఇసుక తెచ్చుకోవాలన్నారు. ఎక్కడబడితే అక్కడ ఇసుకను తోడేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బీస్మిల్లాబాద్ గ్రామం పరిధిలోని పెన్నానదిలో కొందరు అక్రమంగా ఇసుక తరలింపు గేటు పెట్టినట్లు తెలిసిందని వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామ పరిసరాల్లో శనివారం ఆటో బోల్తా పడటంతో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఆరవేటిపల్లె నుంచి బొందలకుంటకు ఎరువులను ఆటోలో తరలించి, తిరిగి వస్తున్న ఆటో ప్రమాదశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరవేటిపల్లెకు చెందిన శ్రీనివాస్ కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎంఈఓ-2గా రామాంజనేయరెడ్డి

ఎర్రగుంట్ల : మండల ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఎంఈఓ-2గా ఎస్.రామాంజనేయరెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా రామాంజనేయరెడ్డి పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు.

లింగాల చెరువుకు నీటి విడుదల

లింగాల : లింగాల కుడికాలువ ఒడ్డున ఉన్న లింగాల ఎత్తిపోతల పథక మోటార్లను ఆన్ చేసి లింగాల చెరువుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రనాథరెడ్డి నీటిని విడుదల చేశారు. రోజుకు 16 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

డివిజన్ పరిధిలో 30 యాక్టు అమలు

జమ్మలమడుగు : జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో 130 యాక్టు అమలులో ఉంటుందని ఇన్‌చార్జి డీఎస్పీ రామాకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ యాక్టు అమలులో ఉన్నందువల్ల ఊరేగింపులు, ధర్నాలు, సభలు నిర్వహించుటకు తప్పనిసరిగా పోలీసుల అనుమతిని తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఈ నిబంధనను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు బైక్‌లు ఢీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని వేంపల్లి రోడ్డులోని బేకరి సమీపంలో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కిరణ్‌బాబు అనే వ్యక్తి గాయపడ్డాడు. ఇతను ఆర్టీపీపీలోని ఓ ఏడీఈకి డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. కలమల్ల వాసిగా గుర్తించారు. అయితే సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా కార్తీక మాస పూజలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 4గంటల నుండి శివుడికి ఆలయ అర్చకులు రుద్రమూర్తి బిల్వార్చన, రుద్ర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. కార్తీక మాసం కావడంతో అయ్యప్ప, శివ దీక్షలు చేపట్టేవారు ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నియమాల మాల ధరించి దీక్ష చేపట్టారు. పార్నపల్లె రోడ్డులోని కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయంలో వెండి కవచంతో ఆంజనేయ స్వామిని ఆలయ అర్చకులు ముగ్ధమోహన రూపంగా అలంకరించారు.



ఉమామహేశ్వరుడిగా శ్రీమిట్టమల్లేశ్వరుడు

ధనలక్ష్మీ అలంకారంలో వాసవీమాత

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ధనలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు లక్ష్మీపార్వతి, సరస్వతి ముగ్గురమ్మల రూపమైన శ్రీ వాసవి మాతకు రూ.5,50,000ల భారతీయ కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ దేవిగా వాసవీ మాతను అలంకరించారు. అనంతరం ఆలయంలో కుంకుమ పూజ, అష్టలక్ష్మీ స్తోత్రం, కనకధారా స్తోత్రం పారాయణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి, అధ్యక్షురాలు పి.ప్రవీణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్యవైశ్య మహిళా మండలి ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ధనలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీమాత

ఉపాధ్యాయ సంఘాల పాత్ర అమూల్యమైనది


పులివెందుల టౌన్ : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాల పాత్ర అమూల్యమైందని ఎంఈఓలు చంద్రశేఖరరావు, రామానాయుడులు తెలిపారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ తరపున మండల వనరుల కేంద్రానికి 15 కుర్చీలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలలకు, విద్యా సంస్థలకు కూడా స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మానవతా దృక్పథంతో చేయూతనివ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.కె.వెంకటనాథరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయకులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయానికి కుర్చీలను వితరణగా అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

విరగపూసిన పూలతోటలతో ఆశల్లో రైతులు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కమ్మవారిపల్లి, బుసిరెడ్డిపల్లి, ఇప్పపెంట, కొలుములపల్లి గ్రామ పొలాల్లో రైతులు వేసిన పూలతోటలు బాగా పండించారు. ఇక్కడ కాసిన బుల్లెట్, సెంటు యెల్లో, వైట్ రకాల పూలను వేలూరు, విజయవాడ, చెన్నై, కంచి తదితర పట్టణాలకు రైతులు చేరవేస్తు అమ్ముకుంటున్నారు. వర్షానికి కొన్ని తోటలు అక్కడక్కడ చనిపోయాయని, రైతులు పూలతోట పండించడానికి నారు, పురుగు తెగుళ్ల మందులు, కూలీలకు కలిపి ఎకరానికి సుమారు లక్ష రూపాయలు ఖర్చుచేస్తున్నట్లు చెప్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పూల ధర పూల నాణ్యత మేరకు కేజీ నలభై రూపాయల నుంచి వంద రూపాయల వరకు ధర పలుకుతోందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం ప్రారంభం అవడంతో పూల ధర మరింతగా పెరిగి తమ కష్టానికి ప్రతిఫలం వస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు.



విస్తారంగా పూలు

రైతుల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

పులివెందుల రూరల్ : రైతుల గురించి మాట్లాడే అర్హత తెలుగుదేశం ప్రభుత్వానికి లేదని రాష్ట్ర నూరు బాషా సంఘ చైర్మన్ రసూల్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్‌రెడ్డిలు అన్నారు. శనివారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబునాయుడు రైతులపట్ల కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. రుణమాఫీ అని రైతులను నట్టేట ముంచారన్నారు. ఉచిత కరెంటు గురించి గతంలో చంద్రబాబు తీగలలపై బట్టలు ఆరవేసుకోవాలని హేళన చేశారన్నారు. దీపావళికి అన్ని వస్తువులు తగ్గిస్తూ ఉంటే చంద్రబాబు దీపావళి దమాఖాగా కరెంటు బిల్లులు పెంచడం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, నల్లచెరువుపల్లె మాజీ సర్పంచ్ వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.